జాతీయ తెలుగు దినపత్రిక
NIZAMABAD EDITION

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నిజామాబాద్ ఆదివారం 13 సెప్టెంబర్ 2026 సంపుటి : 16 సంచిక : 227 పేజీలు : 8 వెల : 1/- RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967



## 24 గంటల విద్యుత్ ఇవ్వాల్సిందే

### వ్యవసాయ విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం.. బాన్సువాడ--కామారెడ్డి రహదారిపై ధర్నా

**గాంధారి, సెప్టెంబర్ 12(ప్రజాజ్యోతి)**

వ్యవసాయానికి నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ గాంధారి మండల కేంద్రంలో రైతులు శనివారం ఆందోళనకు దిగారు. బాన్సువాడ--కామారెడ్డి ప్రధాన రహదారిపై రైతులు పెద్ద సంఖ్యలో బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత విద్యుత్ సరఫరా విధానంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా జరిగేదని, ప్రస్తుతం పరిమిత సమయానికే విద్యుత్ అందుతుండటంతో పంటలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు అవసరమైన సమయంలో విద్యుత్ అందకపోవడంతో సాగు పనులు ఇబ్బందికరంగా మారుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా సమయాన్ని పెంచి వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను పూర్తిస్థాయిలో అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించి పంటలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.రైతుల ధర్నాకు బీఆర్ఎస్ మాజీ జెడ్పీటీసీ హరలే తానాజీరావు, ముస్తప్పా, సాయిలు, గొల్ల మల్లేష్, కొమ్ముల రమేష్, సంజీవులు, జాకిర్, రెడ్డి రాజులు తదితరులు మద్దతు తెలిపారు.

## బాన్సువాడ నియోజక వర్గ ప్రజలకు రుణపడి ఉంటా

### శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి..



**ప్రజా జ్యోతి బోధన్ సెప్టెంబర్ 12...**

ఏడు సార్లు గెలిపించిన బాన్సువాడ నియోజక వర్గ ప్రజలకు రుణపడి ఉంటానని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు,బాన్సువాడ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి చందూర్ మండలం లో ఏర్పాటు చేసిన సభ లో పేర్కొన్నారు. శనివారం ఆయన చందూర్ లిఫ్ట్ ను ఎంపీ సురేష్ షెట్కా ర్ , రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు తో కలిసి ప్రారంభించారు,చందూర్ నుండి లక్ష్మాపూర్ వరకు డబుల్ రోడ్ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. సభలో పోచారం మాట్లాడుతూ సాగు నీరు అందని ప్రాంతాలకు నీటిని అందించాలనే లక్ష్యంతో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను అభివృద్ధి పరిచి రెండు పంటలకు నీరు అందించాలని లక్ష్యంతో ఏర్పాటు చేశామన్నారు. నూటికి నూరు శాతం - మిగతా2లో

## చిరుత సంచారంపై స్పష్టత ఇచ్చిన ఎఫ్ఆర్ఓ నర్సింగ్ రావు

**సిరికొండ, ప్రజా జ్యోతి**





సిరికొండ మండలం జగదంబ తండా పరిధిలో మైపాల్ తాండ సమీపంలో చిరుత కాలి ముద్రలు కనిపించినట్లు సమాచారం అందడంతో చిరుత కాలి ముద్ర లో ఉన్న చోటును పరిశీలించారు ఎఫ్ఆర్ఓ నర్సింగరావు మాట్లాడుతూ చిరుత అటవీ సరిహద్దు పరిధిలోని ప్రాంతాల్లో ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని చిరుతకు సంబంధించిన వివరాలు త్వరలోనే అందిస్తామని ఎఫ్ఆర్ఓ నర్సింగ్ రావు తెలిపారు ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు

## డీజే సౌండ్‌పై బాల్కొండ పోలీసుల కేసు

### అధిక శబ్దంతో శబ్ద కాలుష్యం.. పబ్లిక్ న్యూసెన్స్‌కు కారణమైన డీజే సౌండ్ సిస్టమ్ సీజ్

### డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు: పోలీస్ కమిషనర్



**ప్రజాజ్యోతి ప్రతినిధి:**

గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో డీజే సౌండ్ సిస్టమ్‌ను వినియోగించిన ఘటనపై బాల్కొండ పోలీసులు కేసు నమోదు చేసి, డీజే సౌండ్ సిస్టమ్‌ను సీజ్ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టాపూర్ గ్రామంలో గణేష్ ఆగమన కార్యక్రమం నిర్వహిస్తున్న మండప నిర్వాహకులు అధిక శబ్దంతో డీజే సౌండ్ సిస్టమ్‌ను వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో శబ్ద కాలుష్యం, ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా పబ్లిక్ న్యూసెన్స్‌కు కారణమైన నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. అనంతరం డీజే సౌండ్ సిస్టమ్‌ను సీజ్ చేసి, ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దంతో డీజేలు వినియోగించడం, శబ్ద కాలుష్యం, పబ్లిక్ న్యూసెన్స్‌కు - మిగతా2లో



## విద్యుత్ కోతలపై రైతుల కడుపు మంట

### ఎస్ఈ కార్యాలయం ముట్టడి.. భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా

**కామారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి)**

కరెంట్ కోతలతో అల్లాడుతున్న రైతాంగం సమరభేరి మోగించింది. రోజుకు 18 గంటల పాటు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో శనివారం కామారెడ్డి ఎస్ఈ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు.రామారెడ్డి మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి పెద్ద సంఖ్యలో రైతులు బయలుదేరి కామారెడ్డికి చేరుకుని నిరసన గళం వినిపించారు.ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘం జిల్లా కార్యదర్శి అర్ల శంకర్రావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అప్రకటిత కరెంట్ కోతలతో వరి,సోయా తదితర పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లో-వోల్టేజీ కారణంగా బోరు బావుల మోటార్లు కాలిపోయి ఒక్కో రైతుకు వేలల్లో,జిల్లా వ్యాప్తంగా లక్షల రూపాయల నష్టం వాటిల్లుతోందని వాపోయారు. రైతులు పగలు విద్యుత్ ఇస్తేనే పొలాల్లో పనులు చేసుకునే పరిస్థితి ఉందని, అధికారులు వెంటనే స్పందించి 18 గంటల కరెంట్ సరఫరా - మిగతా2లో

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పారదర్శకంగా చేపట్టాలి





**అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్**

**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** బురుగుల్, గునుకుల్ గ్రామాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్ మహ్మద్‌నగర్ మండలం బురుగుల్, గునుకుల్ గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జుక్కల్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బురుగుల్, గునుకుల్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల నంబర్లు 238, 241లో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మహ్మద్‌నగర్ తహసీల్దార్‌తో కలిసి ఎస్ఐఆర్ పనుల పురోగతిని సమీక్షించారు. గునుకుల్ గ్రామంలో ఓటర్ల నుంచి సమర్పించిన సంబంధిత పత్రాలను పరిశీలించి, వివరాల నమోదు మరియు పత్రాల పరిశీలన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల వివరాల పరిశీలన, దరఖాస్తుల స్వీకరణ, సంబంధిత పత్రాల పరిశీలన తదితర ప్రక్రియలను నిబంధనల ప్రకారం జాగ్రత్తగా పూర్తి చేయాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వివరాల నమోదు లేదా పత్రాల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పేర్లను గుర్తించి, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి, ఓటర్లు సమర్పించాల్సిన పత్రాలు, దరఖాస్తులపై వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అనంతరం బురుగుల్ గ్రామంలోని టీకాల కేంద్రాన్ని కూడా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్ సందర్శించి, అక్కడ అందుతున్న సేవలు, కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్‌నగర్ తహసీల్దార్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాల ధృవతార కామ్రేడ్ సీతారాం ఏచూరి

**2వ వర్ధంతి సందర్భంగా నివాళులు**

**ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి**

**సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్**





**కామారెడ్డి, టౌన్ సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** భారత కమ్యూనిస్టు ఉద్యమంలో తనదైన ముద్ర వేసిన మహోన్నత నాయకుడు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన యోధుడు, ప్రముఖ మేధావి, సీపీఐ(ఎం) అఖిల భారత పూర్వ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రజా ఉద్యమాల ధృవతార అని సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి 2వ వర్ధంతి సందర్భంగా ఆయనకు సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ భారతదేశంలో వామపక్ష ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో సీతారాం ఏచూరి అత్యంత కీలకమైన పాత్ర పోషించారని అన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ అంచెలంచెలుగా జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగారని తెలిపారు. దేశంలో సామాజిక న్యాయం, లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సీతారాం ఏచూరి జీవితాంతం పోరాడారని చంద్రశేఖర్ పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాలు, సామాన్య ప్రజల హక్కుల కోసం ఆయన నిరంతరం గొంతెత్తారని అన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి వాటి పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు.

పార్లమెంటరీ వ్యవస్థపై లోతైన అవగాహన కలిగిన సీతారాం ఏచూరి, ప్రజా సమస్యలను సమర్థవంతంగా ప్రస్తావించడంలో ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు, దేశంలో విస్తృత ప్రజా ఐక్యత నిర్మాణం కోసం విశేషంగా కృషి చేశారని అన్నారు.

సీతారాం ఏచూరి గొప్ప రాజకీయ నాయకుడే కాకుండా మార్క్సిస్టు సిద్ధాంతంపై లోతైన అవగాహన కలిగిన మేధావి, అద్భుతమైన వక్త, రచయిత అని చంద్రశేఖర్ పేర్కొన్నారు. సంక్లిష్టమైన రాజకీయ, సామాజిక అంశాలను కూడా సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించే ప్రత్యేక నైపుణ్యం ఆయనకు ఉండేదన్నారు.

దేశంలో ప్రజాస్వామ్య, లౌకిక విలువల పరిరక్షణ కోసం విభిన్న రాజకీయ పార్టీలతో, ప్రజాస్వామ్య శక్తులతో ఐక్యతను నిర్మించేందుకు సీతారాం ఏచూరి చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసం ఐక్య పోరాటాలు సాగించాల్సిన అవసరాన్ని ఆయన ఎల్లప్పుడూ నొక్కిచెప్పారని గుర్తు చేశారు.

"ప్రజల కోసం పోరాడే ప్రతి ఉద్యమంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆలోచనలు, సిద్ధాంతాలు, పోరాట స్ఫూర్తి మనకు ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయి" అని చంద్రశేఖర్ పేర్కొన్నారు. నేటి పరిస్థితుల్లో కార్మికులు, రైతులు, పేదలు, సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణ కోసం మరింత ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను, సిద్ధాంతాలను, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం కోసం ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా నాయకులు "కామ్రేడ్ సీతారాం ఏచూరి అమర్ రహే!", "సీతారాం ఏచూరి ఆశయాలు వర్ధిల్లాలి!", "ప్రజా ఉద్యమాలు వర్ధిల్లాలి!" అంటూ నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కొత్త నరసింహులు, నారాయణ, ప్రవీణ్, మాసయ్య, రవి, వార్డు సభ్యులు ఎల్లవ్వ, శ్యామల, రమణ, సిద్ధవతో పాటు పలువురు సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు పాల్గొని కామ్రేడ్ సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులర్పించారు.

# కక్షల నుంచి కలయిక వైపు జాతీయ లోక్ అదాలత్

**పి. ముక్తిద,జిల్లా ప్రధాన న్యాయమూర్తి**

**ఛైర్పర్సన్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ,**



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కామారెడ్డి తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కామారెడ్డి ఆధ్వర్యంలో 12 న శనివారం జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రజలకు త్వరితగతిన, సులభంగా మరియు తక్కువ ఖర్చుతో న్యాయం అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. కోర్టుల్లో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కేసులను పరస్పర రాజీ, సఖ్యతా భావంతో పరిష్కరించేందుకు ఈ వేదిక ఎంతో ఉపయుక్తంగా నిలిచింది.ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం 6 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేయబడి, వివిధ న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, బ్యాంకు రికవరీ, కుటుంబ, వివాహ సంబంధిత మరియు ఇతర రాజీకి అనుకూలమైన కేసులను విచారణకు తీసుకున్నారు. ఇరు పక్షాల అంగీకారంతో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించి, వారికి తక్షణ న్యాయం అందించబడింది. మొత్తంగా కేసులు విజయవంతంగా పరిష్కరించబడ్డాయి. వీటిలో సివిల్ కేసులు క్రిమినల్ కేసులు బ్యాంకు రికవరీ కేసులు, ఫ్యామిలీ మరియు మ్యారేజ్ సంబంధిత కేసులు కూడా గణనీయ సంఖ్యలో ఉన్నాయి. ఈ కేసుల పరిష్కారం ద్వారా సంబంధిత పక్షాలు సమయం, ధనం మరియు మానసిక ఒత్తిడిని ఆదా చేసుకోగలిగాయి. జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ సమావేశానికి గౌరవ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి మరియు ఛైర్పర్సన్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కామారెడ్డి పి. ముక్తిద ముఖ్య అతిథిగా హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ, లోక్ అదాలత్ అనేది ప్రజా న్యాయస్థానం లోక్ అదాలత్ వ్యవస్థ ప్రజలకు సత్వర న్యాయం అందించే అత్యంత సమర్థవంతమైన ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వేదిక అని పేర్కొన్నారు. ముఖ్యంగా బ్యాంకు రుణ బకాయిలు, సివిల్ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి సంబంధిత తగాదాలు వంటి వివిధ అంశాల్లో లోక్ అదాలత్ ద్వారా ఇరు పక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. లోక్ అదాలత్ అవార్డు తుది తీర్పుగా పరిగణించబడుతుందని, దానిపై అప్పీల్‌కు అవకాశం ఉండదని వివరించారు. ఇరు పక్షాలకు సంతృప్తికరమైన పరిష్కారం లభించడం వల్ల కుటుంబ, సామాజిక మరియు వ్యాపార సంబంధాలు దెబ్బతిన కుండా కాపాడబడతాయని చెప్పారు. బ్యాంకు డిఫాల్ట్ కేసుల విషయంలో బకాయి మొత్తాన్ని చెల్లించిన వెంటనే కేసు తుది పరిష్కారమై, లోక్ అదాలత్ అవార్డు జారీ చేయబడుతుందని వివరించారు. ఈ అవార్డు సాధారణ కోర్టు తీర్పుతో సమానమైన చట్టబద్ధత కలిగి ఉంటుందని స్పష్టం చేశారు. అదేవిధంగా, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా ప్రజలకు కోర్టులకు వెళ్లకుండానే వివాదాల పరిష్కారం పొందే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.అలాగే, రాజీ మార్గంలో వివాదాలను పరిష్కరించడం వల్ల సమాజంలో శాంతి, సామరస్యం నెలకొంటాయని, కోర్టు వ్యాజ్యాల కారణంగా కలిగే ఆర్థిక మరియు మానసిక భారాలు తగ్గుతాయని పేర్కొన్నారు. ప్రజలు తమ వివాదాలను సఖ్యతా పూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌లను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి. నాగరాణి, అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ, న్యాయ సేవాధికార సంస్థలు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా వేలాది మంది ప్రజలు న్యాయ ప్రయోజనాలను పొందుతున్నారని, ఈ విధానం న్యాయవ్యవస్థపై భారం తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కామారెడ్డి డా. సూర సుమలత,అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి. దీక్ష ,కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ, సూపరింటెండెంట్లు వెంకట్ రెడ్డి, చంద్రసేన్ రెడ్డి,ఖాన్ , వివిధ బ్యాంకుల అధికారులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కక్షిదారులు మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ మాట్లాడుతూ, లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి న్యాయవాదులు యొక్క సహకారం తప్పకుండ ఉంటుంది. అని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రజలకు న్యాయం మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందని, న్యాయ సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతుందని అధికారులు తెలిపారు. పోక్సో బాధితులకు నష్ట పరిహారం అందజేత సమావేశనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పోలీస్ స్టేషన్ నిజాం సాగర్ మరియు మాచారెడ్డి పరిధి లో ఉన్న బాధితులకు ఒకరికి రెండు లక్షలు రూపాయలు మరియు ఇంకొకరికి మూడు లక్షల రూపాయలు నష్ట పరిహారం అందజేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన అధికారులు

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి**

**రాఘవపూర్‌లో డీఈ సుభాష్, హౌసింగ్ ఏఈ రాము తనిఖీ**



**కామారెడ్డి, టౌన్ సెప్టెంబర్ 12 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం రాఘవపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను సంబంధిత అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీఈ సుభాష్, హౌసింగ్ ఏఈ రాము గ్రామంలో పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం లబ్ధిదారులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ, ఇండ్ల నిర్మాణ పనులు సజావుగా జరిగేలా చర్యలు చేపడుతోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోగా ఇండ్లను పూర్తి చేసుకోవాలని కోరారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లను ఒక్కొక్కటిగా పరిశీలించిన అధికారులు, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో పక్కా ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకొని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని లబ్ధిదారులకు తెలిపారు. ఎక్కడైనా నిర్మాణ పనులకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎడ్ల వీనిల్ నరేష్, ఉప సర్పంచ్ నరేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవి లత తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

# లింగంపల్లి ఖుర్ద్ బ్రిడ్జి నిర్మాణ పనులు

**-- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు**



**లింగంపేట్ సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కృషితో లింగంపల్లి ఖుర్ద్ బ్రిడ్జి నిర్మాణ పనులు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిలో మరో ముందడుగు 4.50 కోట్ల నిధులతో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రత్యేక కృషితో కొనసాగుతున్నాయి.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం సురక్షితమైన ప్రయాణం అభివృద్ధి పనులకు నిరంతర కృషి ఇదే మదన్ మోహన్ రావు లక్ష్యం.

# మహా సభను విజయవంతం చేయండి

**-- గిరిజన సంఘం రాష్ట్ర 4 గవ మహాసభ ఈనెల 27,28 విజయవంతం చేయలి**

**-- జిల్లా ప్రధాన కార్యదర్శి మోతిరామ్ నాయక్**





**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండలం రెడ్డి పేట తండాలో మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. మోతిరాం నాయక్ మాట్లాడుతూ ఈ సభ యొక్క ఉద్దేశం గత మూడు సంవత్సరాల పోరాట కార్యక్రమాలను సమీక్షించుకొని రాబోయే మూడు సంవత్సరాల కార్యక్రమాలను రూపకల్పన చేయడం జరుగుతుందని అన్నారు. గిరిజన హక్కులు కాలరాయబడుతున్న ఈ క్రమంలో అటు పెట్టుబడిదారులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ గిరిజనుల దగ్గర ఉన్నటువంటి భూములు గుంజే ప్రయత్నం జరుగుతుందని అన్నారు.ఏదో ఒక వంకతో జిల్లాలో వేల ఎకరాల భూములు గిరిజనులకు అధీనంలో లేకుండా ఆన్లైన్లో ఎగర గొడుతున్నారని అన్నారు. వాళ్లకు ఎరువులు రాకుండా రైతుబంధు రాకుండా ప్రభుత్వ పథకాలు ఏమి రాకుండా అడ్డుకట్ట వేస్తా ఉన్నారని అన్నారు. గిరిజనులు ప్రభుత్వ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్యగానే ఉంటుంది తప్ప పరిష్కారం కావడం లేదని అన్నారు. రాబోయే కాలంలో ఇటువంటి సమస్యల మీద పోరాట రూపకల్పన జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ నాయక్, దేవి సింగ్ నాయక్, గోపాల్ నంద మోహన్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటయోధుడు రావి నారాయణ రెడ్డి

-- తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

--జె.జె.సి.పి. బాబూరావు రీసెర్చ్ స్కాలర్





**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** నిజాం నిరంకుశత్వానికి, దొరల దాష్టీకాలకు మరియు భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు కొనసాగిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సముపార్జించుకుని నిత్యనూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగిపోయింది. 'బాంచెన్ దొరా ... నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం ఆయుధాలు చేబూని దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమెందించారు. ఈ తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అమరుల త్యాగాలతో వేలాది గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందడమే కాకుండా పది లక్షల ఎకరాల భూములు పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి. ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొల్లేపల్లి గ్రామంలోని ఒక సంపన్న భూస్వామ్య కుటుంబంలో గోపాల్ రెడ్డి, వెంకట రామమ్మ దంపతులకు 1908 జూన్ 5 నాడు జన్మించిన రావి నారాయణ రెడ్డి అనునిత్యం అనేక ప్రజా పోరాటాల్లో నడుం బిగించి పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు ఉద్యమించారు. ఆయన భూస్వామ్య కుటుంబంలో జన్మించిననూ తాను విశ్వసించిన ఆదర్శాల కోసం తన స్వంత కుటుంబంతోనే ఘర్షణ పడి వందల ఎకరాల స్వంత భూమిని పేదలకు పంపిణీ చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. అలాగే భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకున్న లక్షలాది ఎకరాల భూమిని నిరుపేద రైతాంగానికి పంపిణీ చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆ రకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అంటూ నినదించి వందల ఎకరాల స్వంత భూమిని పేద ప్రజలకు పంచిన నిస్వార్థ త్యాగశీలి రావి నారాయణ రెడ్డి.ఆంధ్ర జన సంఘం 1930 నాటికి 'ఆంధ్ర మహాసభ'గా రూపుదిద్దుకుంది. ఈ ఆంధ్ర మహాసభ తెలంగాణలో రాజకీయ చైతన్యాన్ని ప్రజ్వలింపజేసింది. 1944 లో భువనగిరిలో జరిగిన పదకొండవ ఆంధ్ర మహాసభ మహాసభకు రావి నారాయణ రెడ్డి గారు అధ్యక్షత వహించారు. సాంస్కృతిక మరియు భాషా చైతన్యం కోసం మాత్రమే పనిచేసిన ఆ ఆంధ్ర మహాసభను రావి నారాయణ రెడ్డి తన నాయకత్వంలో రాజకీయ సమరశీల సంస్థగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేశారు. ఆంధ్ర మహాసభ కార్యక్రమాలు నిజాం కొనసాగిస్తున్న దురాగతాలకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యాన్ని ప్రజ్వలింపజేసి తెలంగాణ సాయుధ పోరాటానికి బాటలు పరిచాయి.ఏడో నిజాం ఉస్మాన్ అలీ ఖాన్ ఏలుబడిలో కొనసాగిస్తున్న దురాగతాలకు వ్యతిరేకంగా రావి నారాయణ రెడ్డి రైతాంగాన్ని సమీకరించి ఉద్యమ ఊపిరి అందించి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపించారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించిన సమయంలో ఆయన అజ్ఞాతంలోకి వెళ్ళి గెరిల్లా దళాలను స్వయంగా ఏర్పాటు చేశారు. గ్రామాల్లోనూ రక్షణ దళాలను నిర్మించి సాయుధ శిక్షణను అందించడంలోనూ, శత్రువులపై మెరుపు దాడులు చేయడంలోనూ మరియు ఆయుధాలు పోగు చేసుకోవడమే కాకుండా శత్రువుల నుండి ఆయుధాలను చేజిక్కించుకోవడంలోనూ ఆయన అనేక వ్యూహాలను అనుసరించారు.సాయుధ పోరాట ఉధృతి పెరగడంతో కొన్ని జిల్లాల్లో ఏకంగా నిజాం పాలన నిలిచిపోయింది. ఒక దశలో భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు తెలంగాణ నుండి పలాయనం చిత్తగించారు. ఈ ఘటనలు సాయుధ పోరాట విజయానికి సంకేతంగా నిలిచాయి. రావి నారాయణ రెడ్డి నేతృత్వంలో వేలాది గ్రామాలలో 'గ్రామ స్వరాజ్యాలు' ఏర్పడ్డాయి. పది లక్షల ఎకరాల భూములు పేదలకు పంపిణీ చేయబడ్డాయి.భారత ప్రభుత్వం 1948 సెప్టెంబర్ నెలలో చేపట్టిన 'పోలీస్ చర్య' ద్వారా నిజాం లొంగుబాటుతో హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనం కాబడింది. ఆ సమయంలో కమ్యూనిస్టు పార్టీలోని ఒక వర్గం భారత సైన్యానికి వ్యతిరేకంగా కూడా సాయుధ పోరాటాన్ని కొనసాగించాలి అని తీర్మానించింది. 'నిజాం లొంగుబాటు తర్వాత ప్రజాస్వామ్య భారతదేశంలో సొంత సైన్యంతో తలపడటం సరైనది కాదు' అని రావి నారాయణ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించి రావి నారాయణ రెడ్డి తన పోరాట అనుభవాలను 'వీర తెలంగాణ నా అనుభవాలు – జ్ఞాపకాలు' అనే పుస్తకం ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారు.

భారతదేశంలో 1952 లో మెట్టమొదటిసారిగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించగా కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్న కారణంగా 'పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్' (పి.డి.ఎఫ్) అనే పేరుతో నల్లగొండ పార్లమెంట్ స్థానం నుండి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై బరిలో నిలిచిన రావి నారాయణ రెడ్డి దేశంలోనే అత్యధిక ఓట్ల మెజారిటీతో విజయం సాధించి సరికొత్త చరిత్రని సృష్టించారు. అలాగే స్వతంత్ర భారత పార్లమెంట్‌లో అడుగుపెట్టిన తొలి వ్యక్తిగా కూడా రావి నారాయణ రెడ్డి సరికొత్త చరిత్ర సృష్టించారు.

పార్టీ ఆశయాల కోసం ఆఖరిక్షణం వరకు అంకితభావంతో పనిచేసి అతి సామాన్య మరియు అతి నిరాడంబర జీవితాన్ని గడిపిన రావి నారాయణ రెడ్డి 1991 సెప్టెంబర్ 7 నాడు మరణించిననూ భారత కమ్యూనిస్టు ఉద్యమంలోనూ మరియు తెలంగాణ సాయుధ పోరాటంలోనూ వేగుచుక్కగా వెలుగొందుతూనే ఉన్నారు. అంతిమంగా ఆయన జీవితం నుండి భావితరాలు ముఖ్యంగా కమ్యూనిస్ట్ సమాజ స్వాప్నికులు

# ఆకలి తీర్చడమే అసలైన మానవత్వం!

**యాచకులకు ఆహారం అందించిన సీతలే రమేష్**

**బీర్కూర్, ప్రజాజ్యోతి సెప్టెంబర్ 12:** ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలు, యాచకులకు ఆహారం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సీతలే రమేష్. బస్టాండ్ ఆవరణలో రాత్రి వేళల్లో ఆహారం లేక ఇబ్బందులు పడుతున్న యాచకులను గుర్తించి ఆయన ఆధ్వర్యంలో సమోసా, బ్రెడ్‌తో పాటు తాగునీటిని అందించారు. ఈ సందర్భంగా సీతలే రమేష్ మాట్లాడుతూ.. సమాజంలో ఎంతోమంది ఆర్థిక ఇబ్బందులతో కనీస అవసరాలను తీర్చుకోలేని పరిస్థితుల్లో జీవిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆలయాల పరిసరాల్లో ఆకలితో ఉండే నిరుపేదలు, నిరాశ్రయులు, యాచకులకు ఆహారం అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. "అన్నదానం అంటే ఉన్నవారు తినడం కాదు.. అన్నం లేనివాడికి పెట్టడమే నిజమైన అన్నదానం" అని సీతలే రమేష్ పేర్కొన్నారు. మనకు ఉన్నదానిలో కొంత భాగాన్ని అవసరమైన వారికి అందించడం ద్వారా వారి ఆకలి తీర్చడంతో పాటు మనలోని మానవత్వాన్ని చాటుకోవచ్చున్నారు. ప్రతి గ్రామంలోనూ నిరుపేదలు, నిరాశ్రయులు, యాచకులు ఉన్నారని, వారిని గుర్తించి సందర్భానుసారంగా ఆహారం, తాగునీరు, అవసరమైన సహాయం అందించాలని కోరారు. సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు పెద్ద మొత్తంలో డబ్బు అవసరం లేదని, మనసుంటే చిన్న సహాయం కూడా ఒకరి జీవితంలో పెద్ద మార్పును తీసుకురాగలదని అన్నారు.

అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటు సేవా భావాన్ని కూడా అలవాటు చేయాలని సూచించారు. చిన్నతనం




నుంచే ఇతరులకు సహాయం చేసే గుణాన్ని పెంపొందిస్తే వారు భవిష్యత్‌లో సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదుగుతారని తెలిపారు.

లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. ఆకలితో ఉన్న వారికి ఆహారం అందిస్తూ, ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన మేరకు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సీతలే రమేష్ పిలుపునిచ్చారు.

# మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం





**మట్టి గణపతి ప్రతిమలు, మొక్కల పంపిణీ**

**గాంధారి, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి)** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి ప్రతిమలను పూజించాలని గాంధారి అటవీ క్షేత్రాధికారి కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి గణపతి ప్రతిమలు, మొక్కలను పంపిణీ చేశారు. 'మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' అనే నినాదంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గాంధారి రేంజ్ ఆఫీసర్ రమేష్ మాట్లాడుతూ.. మట్టి గణపతి ప్రతిమలతో వాతావరణం, నీటి కాలుష్యాన్ని నివారించవచ్చున్నారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను వినియోగించి, పండుగను భక్తిశ్రద్ధలతో పాటు ప్రకృతి పరిరక్షణకు అనుగుణంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధారి సర్పంచ్ మమ్మాయి రేణుక--సంజీవ్ యాదవ్, ఉపసర్పంచ్ భాస్కర్ గౌడ్, పాలకవర్గ సభ్యులు, ఏఎంసీ చైర్మన్ బండారి పరమేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగసాని శ్రీనివాస్, వీడీసీ చైర్మన్ రామస్వామి, గాంధారి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్, అటవీ అధికారులు, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చందూర్ లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్‌లు ప్రారంభం

-- ఎంపీ సురేష్ షట్కార్

-- పోచారం శ్రీనివాస్ రెడ్డి






**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** చందూర్ మండల కేంద్రంలో చందూర్ లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లను ప్రారంభించి, ఆయకట్టు పొలాలకు సాగునీటిని విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి,

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చందూర్ మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.మొదటగా చందూర్ బస్టాండు వద్ద బాన్సువాడ – నిజామాబాద్ రహదారిపై శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

# పారా కిక్ బాక్సింగ్‌లో తెలంగాణ సత్తా అరవింద్ కుమార్‌కు స్వర్ణం

పారా కిక్‌బాక్సింగ్‌లో తెలంగాణ సత్తా

పీ1 కేటగిరీలో ప్రథమ స్థానం.. గుడుగుల అరవింద్ కుమార్‌కు స్వర్ణం

రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన తెలంగాణ జట్టు





**కామారెడ్డి టౌన్, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** పారా కిక్‌బాక్సింగ్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర ఖ్యాతిని చాటారు. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్న ప్రతిష్టాత్మక పోటీల్లో పీ1 కేటగిరీలో తెలంగాణ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. తెలంగాణ తరఫున పాల్గొన్న గుడుగుల అరవింద్ కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని సాధించారు. మధ్యప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర, కేరళ, పంజాబ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల క్రీడాకారులతో పోటీ పడుతూ తెలంగాణ జట్టు ఈ ఘన విజయాన్ని నమోదు చేసింది. జట్టు విజయంలో కోచ్ అశమ్మల సూర్యప్రసాద్ అందించిన శిక్షణ, మార్గదర్శకత్వం కీలక పాత్ర పోషించాయి. జట్టు సభ్యులు అర్జున్ ఆర్య, ఉదయ్ కుమార్ కూడా విజయానికి తమవంతు సహకారం అందించారు. పీ1 కేటగిరీలో ప్రథమ స్థానం సాధించడంతో పాటు అరవింద్ కుమార్ స్వర్ణ పతకం కైవసం చేసుకోవడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ జట్టు సభ్యులను అభినందించారు.

జట్టు: గుడుగుల అరవింద్ కుమార్ (క్రీడాకారుడు), అశమ్మల సూర్యప్రసాద్ (కోచ్), అర్జున్ ఆర్య, ఉదయ్ కుమార్ (జట్టు సభ్యులు).

# విద్యార్థులు మట్టి గణపతుల తయారీ



**సదాశివనగర్, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో పాఠశాల విద్యార్థులు పర్యావరణాన్ని రక్షించేందుకు మట్టి గణనాథులను తయారు చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ భక్తులు మట్టి గణపతులను తయారుచేసి పూజిస్తూ పర్యావరణాన్ని రక్షించాలని విద్యార్థులు సూచించారు. గణనాథుల తయారీలో కళాశాల ప్రిన్సిపల్ రాజారెడ్డి. అధ్యాపకులు విద్యార్థులకు సయా సహకారాలు అందించారు.

# శాంతియుత వాతావరణంలో వినాయక చవితి నిర్వహించాలి

### అల్లర్లకు తావివ్వకుండా భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలి

### విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి

### డీజేలకు అనుమతి లేదు

### దేవునిపల్లి ఎస్సై రంజిత్



**కామారెడ్డి టౌన్, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో వినాయక చవితి పండుగను ప్రశాంత, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు, వివాదాలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో పండుగను జరుపుకోవాలని దేవునిపల్లి ఎస్సై రంజిత్ సూచించారు.

ఈ సందర్భంగా ఎస్సై రంజిత్ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు, గ్రామ ప్రజలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు. పండుగ సందర్భంగా గ్రామంలో ఎలాంటి అల్లర్లు, వివాదాలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. గణేష్ మండపాల వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో వర్షాలను దృష్టిలో ఉంచుకుని గణేష్ మండపాల ఏర్పాటు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ వైర్లు, విద్యుత్ స్తంభాలు, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని పేర్కొన్నారు.

చిన్నపిల్లలు గణేష్ మండపాల వద్దకు వచ్చినప్పుడు నిర్వాహకులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. వర్షాలు, విద్యుత్ సౌకర్యాలు, రద్దీ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని పిల్లల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

అలాగే వినాయక ఉత్సవాల సందర్భంగా డీజేలు ఏర్పాటు చేయవద్దని ఎస్సై రంజిత్ స్పష్టం చేశారు. శబ్ద కాలుష్యానికి తావివ్వకుండా పోలీసు శాఖ సూచనలు, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ పండుగను నిర్వహించాలని కోరారు. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా, గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.

గణేష్ మండపాల నిర్వాహకులు అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలంతా ఐక్యంగా, సోదరభావంతో కలిసి వినాయక చవితి వేడుకలను ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్సై రంజిత్ పిలుపునిచ్చారు.

ఈ పీస్ కమిటీ సమావేశంలో దేవునిపల్లి ఏఎస్ఐ రామకృష్ణ, కానిస్టేబుల్ ఓం ప్రకాష్, వీడీసీ అధ్యక్షుడు కాసర్ల రవీందర్, గుడెల్లి గంగారం, ప్రతినిధులు ధ్యావారి నవీన్, నీట్టు లింగరావు, మరూకంటి స్వామి, అవుసుల గంగాధర్‌తో పాటు దేవునిపల్లి గ్రామ ప్రజలు, వివిధ గణపతి మండపాల అధ్యక్షులు, కార్యదర్శులు, నిర్వాహకులు, మండపాల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నిరసనలు, ఆందోళనల సమయంలో సంయమనం పాటిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించాలి






### ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్స్‌కు దూరంగా ఉండాలి

### ప్రజలతో మర్యాదగా, చట్టబద్ధంగా వ్యవహరించాలి

### సిబ్బంది అభిప్రాయాలను తెలుసుకున్న జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర

**కామారెడ్డి, టౌన్ సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** నిరసనలు, ఆందోళనలు, ఉద్యమాల సమయంలో పోలీసు సిబ్బంది పూర్తి సంయమనంతో వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించాలని జిల్లా ఎస్పీ శ్రీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ సూచించారు. విధి నిర్వహణలో ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూనే చట్టబద్ధమైన విధానాలను కచ్చితంగా పాటించాలని ఆయన పేర్కొన్నారు.

కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిరసనలు, ఆందోళనల సమయంలో పోలీసులు వ్యవహరించాల్సిన విధి విధానాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో హోంగార్డు స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరూ బందోబస్తు విధుల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ముఖ్యంగా నిరసనలు, ఆందోళనలు, ఉద్యమాల సమయంలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి, అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఆ హక్కును గౌరవిస్తూనే శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని తెలిపారు. పరిస్థితులను సమర్థవంతంగా అంచనా వేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

చేయాల్సినవి--చేయకూడనివిపై అవగాహన

నిరసనలు, ఉద్యమాలు, ఆందోళనల సమయంలో పోలీసు సిబ్బంది పాటించాల్సిన చేయాల్సినవి, చేయకూడనివి (డూస్ అండ్ డోంట్స్) అంశాలను జిల్లా ఎస్పీ సిబ్బందికి సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. ప్రతి సందర్భంలో సంయమనం, ఓర్పు, వృత్తి నైపుణ్యంతో వ్యవహరించాలని సూచించారు.

విధి నిర్వహణలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, ఉన్నతాధికారుల సూచనలు, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజలతో గౌరవప్రదంగా మాట్లాడుతూ, వారి సమస్యలను అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలని తెలిపారు.

సోషల్ మీడియాలో అప్రమత్తత అవసరం

ప్రస్తుత కాలంలో ఇంటర్నెట్, సోషల్ మీడియా వినియోగం విస్తృతంగా పెరిగిన నేపథ్యంలో పోలీసు సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ సూచించారు. నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మకూడదని, అలాగే ఎలాంటి సమాచారాన్ని ధృవీకరించకుండా ప్రచారం చేయరాదని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, సందేశాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంలో వృత్తి నైపుణ్యంతో వ్యవహరించాలని సూచించారు. పోలీసు శాఖ ప్రతిష్టను కాపాడే విధంగా ప్రతి సిబ్బంది బాధ్యతగా ప్రవర్తించాలని పేర్కొన్నారు.

సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడిన ఎస్పీ

అనంతరం జిల్లా ఎస్పీ పోలీసు సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సిబ్బంది వ్యక్తం చేసిన పలు అంశాలను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విశ్లేషించి, వాటి వల్ల పోలీసు శాఖపై పడే అనుకూల, ప్రతికూల ప్రభావాలను వివరించారు.

విధి నిర్వహణతో పాటు ప్రతి పోలీసు సిబ్బంది వ్యక్తిగత జీవితం, కుటుంబ బాధ్యతల విషయంలో కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూనే కుటుంబానికి తగిన సమయం కేటాయించాలని తెలిపారు.

**ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్స్‌కు దూరంగా ఉండాలి**

ముఖ్యంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్ వంటి వాటికి పోలీసు సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. క్షణికమైన ఆశలు, ఆకర్షణలకు లోనై ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్స్‌కు అలవాటు పడటం వల్ల వ్యక్తిగత, కుటుంబ, ఆర్థిక జీవితాలపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉందని తెలిపారు. అప్పుల బారిన పడే పరిస్థితులను నివారించేందుకు ఇటువంటి కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. మన పిల్లల భవిష్యత్తు, కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. తాత్కాలిక ఆకర్షణల కోసం కుటుంబాన్ని ఇబ్బందుల్లోకి నెట్టే చర్యలకు పాల్పడవద్దని దిశానిర్దేశం చేశారు.

**స్నేహితుడిని మంచి మార్గంలో నడిపించాలి**

తమ స్నేహితుడు ఎవరైనా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు లేదా ఇతర హానికరమైన అలవాట్లకు గురవుతున్నట్లు గుర్తిస్తే "నాకెందుకులే" అంటూ పక్కకు తప్పుకోకుండా, అతడికి సరైన సూచనలు ఇచ్చి మంచి మార్గంలో నడిపించే ప్రయత్నం చేయాలని ఎస్పీ సూచించారు. అవసరమైన సమయంలో స్నేహితుడికి అండగా నిలవడం, సరైన మార్గదర్శకత్వం అందించడం నిజమైన స్నేహానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ తోటి సిబ్బంది, స్నేహితులు, కుటుంబ సభ్యుల సంక్షేమం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

ప్రతి పోలీసు సిబ్బంది ప్రజలతో మర్యాదగా, సంయమనంతో వ్యవహరిస్తూ చట్టబద్ధమైన విధానాలను పాటించాలని జిల్లా ఎస్పీ శ్రీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ సూచించారు. పోలీసులపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగే విధంగా ప్రతి ఒక్కరూ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ పాత్ర అత్యంత కీలకమైనదని, విధి నిర్వహణలో క్రమశిక్షణ, సంయమనం, బాధ్యతాయుతమైన ప్రవర్తనకు ప్రతి సిబ్బంది ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సంతోష్ కుమార్, నవీన్, ఆర్ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థికి సన్మానం

### బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందనలు



**బీర్కూర్,ప్రజాజ్యోతి సెప్టెంబర్ 12:** బీర్కూర్ మండలంలోని గురుకుల కళాశాలలో ఇంటర్ ఎం.పి.సి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న నివర్తి అనే విద్యార్థి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన సందర్భంగా బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థి క్రీడా ప్రతిభను అభినందిస్తూ శాలువాతో సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె. గోవర్ధన్‌రావు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సరోజా లక్ష్మి, లయన్స్ ట్రెజరర్ సుధాకర్ రెడ్డి, జోన్ చైర్మన్ సితల రమేష్, లయన్ సభ్యులు మేరూ భరత్, గంగారెడ్డి మరియు అధ్యాపకులు కళాశాల సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థి రాష్ట్రస్థాయిలో రాణించి కళాశాలకు, బీర్కూర్ మండలానికి మంచి పేరు తీసుకురావాలని వారు కోరారు.

## విద్యుత్ కోతల పై రైతుల కడుపు మంట



-మొదటిపేజీ తరువాయి

చేయాలని డిమాండ్ చేశారు. రైతులతో కలిసి తమ గళాన్ని వినిపించామని, రైతుల ఐక్యతతోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని, పంట మనది – పోరాటం మనదే అని నినాదంతో రైతులలో ఉత్తేజాన్ని మేలుకొలుపు పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో భారతీయ కిసాన్ సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు, గ్రామ కమిటీల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యుత్ వ్యవస్థ పై నిరసన వ్యక్తం చేశారు.

## మాతా--శిశు సంరక్షణ, పోషకాహార పంపిణీ

### -- ఘనంగా నిర్వహించిన రోటరీ క్లబ్




**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** మాతా--శిశు ఆరోగ్య సంరక్షణతో పాటు చిన్నారుల్లో పోషకాహారం పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కాకతీయనగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మాతా--శిశు సంరక్షణ మరియు పోషకాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డా. ప్రియాంక ముఖ్య అతిథిగా, డా. ఆర్. మానస అతిథిగా హాజరై తల్లులు, చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం, పరిశుభ్రత మరియు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులు, తల్లులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, తల్లి ఆరోగ్యం--శిశువు ఆరోగ్యం కుటుంబ ఆరోగ్యానికి పునాది అని, చిన్నారులకు చిన్న వయస్సు నుంచే సమతుల్యమైన పోషకాహారం అందించడం ఎంతో అవసరమని తెలిపారు. సమాజంలోని పేద మరియు అవసరమైన వర్గాలకు ఆరోగ్యం, విద్య, పోషకాహారం వంటి అంశాల్లో రోటరీ క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటేరియన్ యాచం శంకర్, రమణ, నాగభూషణం, శ్రీగాడి లక్ష్మీనారసింహులు, కల్కి శ్రీధర్ తదితర రోటరీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే కార్యక్రమానికి క్లబ్ ప్రెసిడెంట్ రోటేరియన్ సబ్బాని కృష్ణ హరి, క్లబ్ సెక్రటరీ రోటేరియన్ సోమిశెట్టి సంతోష్ కుమార్, క్లబ్ ట్రెజరర్ రోటేరియన్ మోటూరి భైరయ్య తదితరులు హాజరయ్యారు. ఆరోగ్యవంతమైన తల్లి, ఆరోగ్యవంతమైన శిశువుఆరోగ్యవంతమైన సమాజం అనే లక్ష్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ ఘోర దుర్మరణం

## లారీ చక్రాల కింద నలిగి బడా భీమ్‌గల్ వాసి మృతి

**ఇందల్వాయి, సెప్టెంబర్ 12,(ప్రజా జ్యోతి ):** రాష్ట్ర రహదారిపై శనివారం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. దంపతులు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఈ విషాద సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బడా భీమ్‌గల్ గ్రామానికి చెందిన దుమాల లింబాద్రి (45, వృత్తి: వ్యవసాయం), ఆయన భార్య దుమాల సుజాత (35, గృహిణి) కామారెడ్డిలో వ్యక్తిగత పనులు ముగించుకుని తమ మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి తిరుగుపయనమయ్యారు. మార్గమధ్యలో ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రయాన్ పల్లి గ్రామ శివారులో , వెనుక వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఒక లారీ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ తీవ్రంగా అదుపుతప్పి కిందపడిపోగా, సుజాత లారీ వెనుక చక్రాల కింద పడిపోయింది. లారీ చక్రాలు ఆమెపై నుంచి వెళ్లడంతో తీవ్ర రక్తస్రావమై సంఘటన స్థలంలోనే ప్రాణాలు వదిలింది. బైక్ నడుపుతున్న భర్త లింబాద్రి స్వల్ప గాయాలతో బయటపడినప్పటికీ, కళ్లముందే భార్య మృతిచెందడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

**రోడ్డుపై భారీగా నిలిచిన ట్రాఫిక్:**

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. దట్టమైన రద్దీ ఉన్న ప్రాంతం కావడంతో కాసేపు ట్రాఫిక్ తీవ్రంగా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఇందల్వాయి ఎస్ఐ సుమలత తమ సిబ్బందితో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి భర్త దుమాల లింబాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమలత తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ వాహనంతో సహా అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు పోలీసులు వెల్లడించారు. రోడ్డుపై వెళ్లే వాహనదారులు వేగ పరిమితి పాటిస్తూ జాగ్రత్తగా వెళ్లాలని ఈ సందర్భంగా పోలీసులు విజ్ఞప్తి చేశారు.




# సెప్టెంబర్ 17ను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా జరపాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి**

**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి) :** సెప్టెంబర్ 17ను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా జరపాలని,హైదరాబాద్ నడిబొడ్డున సర్దార్ పటేల్ భారీ విగ్రహం, ప్రపంచస్థాయి మ్యూజియం ఏర్పాటు చేయాలని,ప్రతి జిల్లాలో అమరుల స్మారక కేంద్రాలు నిర్మించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులుదినేష్ పటేల్ కులాచారి డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల తరహాలోనే తెలంగాణలోనూ అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల కోసమే సెప్టెంబర్ 17 వేడుకలను నిర్వహించకుండా చేస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి రేవంత్ ఉద్దీన్ లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రజాకార్ల హయాంలో సాగిన బలవంతపు మతమార్పిడులు, రామ్‌జీ గోండ్ సహా వెయ్యి మందిని ఉరితీసిన నిర్మల్ ఉదంతం,వల్లాలలో త్రివర్ణ పతాకం ఎగురవేసిన పది మంది బడిపిల్లల హత్య, గుండ్రంపల్లి బావిలో 200 మందిని ఊచకోత కోసిన అకృత్యాలను ఆయన గుర్తుచేశారు. కొమురం భీమ్,దొడ్డి కొమరయ్య వంటి వీరుల త్యాగాలతో పాటు సర్దార్ వల్లభభాయ్ పటేల్ దృఢ సంకల్పం, ఆపరేషన్ పోలో?సైనిక చర్యల ఫలితంగానే తెలంగాణ విముక్తి సాధించి భారతదేశంలో విలీనమైందన్నారు. రజాకార్లు, ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ అనే దుష్ట చతుష్టయం, కుటుంబ పాలన నుంచి తెలంగాణకు పూర్తి విమోచన లభించాలని పేర్కొన్నారు. భైరాన్‌పల్లి,పరకాల వంటి పోరాట గ్రామాల్లో స్మారక స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు ఈ చరిత్రను పాఠశాల పాఠ్యాంశాల్లో చేర్చాలని, విమోచన పోరాట ప్రాంతాలతో టూరిజం సర్క్యూట్ రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్ కార్ లక్ష్మీనారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్ కుమార్, న్యాలం రాజు, పద్మరెడ్డి, బొబ్బిలి వేణు గోపాల్, పోతుల పురుషోత్తం, జగన్ రెడ్డి, ఆనంద్, శంకర్ రెడ్డి,రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# గణేష్ నవరాత్రులు భక్తి శ్రద్ధలతో శాంతియుతంగా నిర్వహించుకోవాలి

**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి) :** నిజామాబాద్ నగరంలో వినాయక చవితి, గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గణేష్ మండలి నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నగర మేయర్ కూరగాయల ఉమారాణి, ఏసీపి ప్రకాష్, 2వ టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ యాదగిరిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ గణేష్ మండలి నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడుతూ?గణేష్ నవరాత్రులను భక్తి శ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ సహకరించాలని, పోలీసు అధికారులు ఇచ్చే మార్గదర్శకాలను పాటించాలని కోరారు. పోలీసు అధికారులు కూడా ఉత్సవాల సమయంలో భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ధ్వని వ్యవస్థల పరిమితులు, ఇతర నిబంధనల గురించి మండలి నిర్వాహకులకు వివరించారు. అందరూ సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా జరగాలని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు,వివిధ గణేష్ మండలి నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# టీఎన్జీవో ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి) :** టీఎన్జీవో జిల్లా కార్యాలయంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత మట్టిగణపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేడాదిలాగే ఈ సంవత్సరం కూడా టిఎన్జీవో ఆధ్వర్యంలో గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఉద్యోగులందరికీ ,జిల్లా ప్రజలకు వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ మట్టి గణపతిని పూజించి, పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. గణపతి నవరాత్రులలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం టీఎన్జీవో గణేష్ మండలిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని, ఉద్యోగులు జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై గణనాథుని కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షులు సంజీవయ్య, జాఫర్ హుస్సేన్, టీఎన్జీవో అర్బన్ యూనిట్ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్,సృజన్ కుమార్ తదితరులు హాజరై పంపిణీ చేశారు.

# వ్యవసాయానికి 18 గంటల నిరంతర విద్యుత్ ఇవ్వాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి**

**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి) :** జిల్లాలో వ్యవసాయ రంగానికి లో-వోల్టేజ్ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా రోజుకు 18 గంటల పాటు సరఫరా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా ఎలక్ట్రిసిటీ సూపరింటెండెంట్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతాంగం సుమారు 2.5 లక్షల వ్యవసాయ పంపుసెట్ల కింద దాదాపు 6 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశారని తెలిపారు. అయితే ప్రభుత్వం రైతులకు అవసరమైన విద్యుత్‌ను అందించడం లో ఘోరంగా విఫలమైందన్నారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న అరకొర 7 నుంచి 8 గంటల కరెంట్ కూడా లో-వోల్టేజీతో వస్తుండటం తో వ్యవసాయ బోర్ల మోటార్లు కాలిపోతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పంటలకు సకాలంలో నీరందక అన్నదాతలు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఎలాంటి లో-వోల్టేజీ సరఫరా అంతరాయాలు లేకుండా రోజుకు 18 గంటల నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, ఉద్యమాలు చేపడతామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొతన్ కార్ లక్ష్మీనారా యణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్ కుమార్, తిరుపతిరెడ్డి, గంగారెడ్డి, కర్క గంగారెడ్డి, తోట చిన్నయ్య,రాజేశ్వర్ రెడ్డి, అన్నం గోపి,పద్మా రెడ్డి, జగన్ రెడ్డి, ఆనంద్, శంకర్ రెడ్డి, నాయిడి రాజన్న, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



# మాజీ సర్పంచ్ ఎల్లయ్య కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి



**డిచ్ పల్లి ప్రజా జ్యోతి సెప్టెంబర్ 12** డిచ్పల్లి మండలం సుద్దపల్లి గ్రామం మాజీ సర్పంచ్ పానుగంటి ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను నిజామాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేష్ కులాచారి పరామర్శించారు. శనివారం ఎల్లయ్య నివాసానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ.. ఎల్లయ్య గతంలో సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి గ్రామానికి, రాజకీయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. మంచి రాజకీయ నాయకుడిని కోల్పోయామని అన్నారు. ఎల్లయ్య కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రూపా సతీష్ రెడ్డితో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 6 వారాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ 1784 కేసులు నమోదు

**కోటి 45,20,000/- జరిమానా . . . 124 మందికి వారం రోజులు జైలు శిక్ష**

**వివరాలు వెల్లడించిన పోలీసు కమిషనర్ సాయిచైతన్య**



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి) :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన 6 వారాలలో డ్రంకన్ డ్రైవ్ లో 1784 మంది పట్టుబడగా వారిని నిజామాబాద్, బోధన్, అర్మూర్ కోర్టులలో వారిని హాజరు పర్చగా ఇందులో 124 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని మిగిలిన వారికీ కోటి 45,20,000/- జరిమానా విధించినట్లు పోలీసు కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్,ఆర్మూర్, బోధన్ డివిజన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ సమీపాలలో వారి వారి పోలీస్ స్టేషన్ పరిధిలలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 2 నుంచి 12 వరకు వాహన తనిఖీలు నిర్వహించగా ఇందులో మొత్తం 1784 కేసుల నమోదు చేయడం జరిగిందన్నారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనాదారులు వాహనానికిసంబంధించి నటువంటి పత్రములు సక్రమముగా తమ వద్ద ఉంచుకోవాలని, డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన వారి లైసెన్స్ 6 నెలల పాటు సస్పెండ్ చేయబడునన్నారు. మైనర్లు తాగి వాహనం నడిపి పోలీస్ వారికి దొరికినట్లైతే మైనర్, వెహికల్ ఓనర్ పైన ఛార్జ్ షీట్ నమోదు చేయబడును అలాగే జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. ఒక సారి కంటే ఎక్కువ సార్లు పట్టుబడినట్లయితే జైలు శిక్ష విధించబడునని, మోటర్ వెహికల్ యాక్ట్ 1989 (చట్టం సవరణ - 2019) అమలులో ఉన్నందున డ్రంక్ అండ్ డ్రైవ్ లో మొదటిసారి పట్టుబడినట్లయితే 10,000/- జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష లేదా జరిమానా తో పాటు జైలు శిక్ష విధించబడునన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ లో రెండోసారి పట్టుబడినట్లైతే 15000/- జరిమానా లేదా జైలు శిక్ష లేదా జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడునని సీపీ తెలిపారు.

# మాజీ సర్పంచ్ బాలవ్వ కుటుంబానికి బిజేపి నాయకుడు దినేష్ కులచారి పరామర్శ



**ఇందల్వాయి, సెప్టెంబర్ 12, (ప్రజా జ్యోతి ):** మండల కేంద్రంలోని చంద్రాయన్ పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అరేటి బాలవ్వ ఇటీవల మృతి చెందడంతో, వారి కుమారుడు, ప్రస్తుత గ్రామ సర్పంచ్ అరేటి రఘుతో పాటు వారి కుటుంబ సభ్యులను శనివారం బిజేపి రూరల్ ఇంచార్జ్ దినేష్ కులచారి నేరుగా కలిసి పరామర్శించారు.
?గ్రామంలోని వారి నివాసానికి చేరుకున్న దినేష్ కులచారి, బాలవ్వ చిత్రపటానికి పూలమాల వేసి భావోద్వేగంతో అశ్రునయనాల నడుమ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధికి మాజీ సర్పంచ్ బాలవ్వ చేసిన సేవలు, ప్రజలతో ఆమెకున్న అనుబంధం నిరంతరం గుర్తుండిపోతాయని కొనియాడారు. అనంతరం సర్పంచ్ అరేటి రఘును, కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన గాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. అమరురాలైన బాలవ్వ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.
?ఈ కార్యక్రమంలో బిజేపి మాజీ మండల అధ్యక్షుడు నాయిడి రాజన్న , మండల ఇంచార్జ్ అధ్యక్షుడు శ్రీనివాస్ జెల్లెల, ఇందల్వాయి ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్,జగత్ సింగ్, బిపేట సాయికుమార్,సంజీవ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జోగా శ్రీనివాస్ మృతి బాధాకరం

**ఆత్మీయ మిత్రుడిని కోల్పోయాను: భార్గవ్**



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి) సెప్టెంబర్. 12** ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామంలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న భార్గవ్ తన ఆత్మీయ మిత్రుడు జగ్గా శ్రీనివాస్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ ఇక లేరనే విషయాన్ని తన మనసు నమ్మలేకపోతోందని, ఆయనతో ఉన్న స్నేహబంధం, మధుర జ్ఞాపకాలు ఎప్పటికీ తనను వెంటాడుతూనే ఉంటాయని భార్గవ్ ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆత్మీయ మిత్రుడిని కోల్పోవడం ఎంతో బాధాకరమని పేర్కొంటూ, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, పిల్లలు భవిష్యత్తులో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తన మిత్రుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు భార్గవ్ తెలిపారు.

# కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ప్రజాజ్యోతి, రెంజల్.** రెంజల్ మండలంలోని పేపర్ మిల్ గ్రామపంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ సర్పంచ్ జుబేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జుబేర్ మాట్లాడుతూ కొత్తగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందుతాయని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అబ్జాల్,వార్డు సభ్యులు, గ్రామస్తులు ఉబెద్, శ్రీకాంత్,రెవెన్యూ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణంలో ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి

**హసన్‌పర్తి :** హసన్‌పర్తి పరిధిలోని ఎస్సార్ విశ్వవిద్యాలయ భవన నిర్మాణ పనుల్లో ప్రమాదం చోటుచేసుకుంది. ఇనుపరాడ్డు తలకు గుచ్చుకోవడంతో జార్ఖండ్‌కు చెందిన కార్మికుడు పప్పు కుమార్ (31) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు హసన్‌పర్తి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.జార్ఖండ్ రాష్ట్రం లాతేహార్ జిల్లా మురుపు ప్రాంతం బాలుగాడి గ్రామానికి చెందిన పప్పు కుమార్ తన సోదరుడు గుడ్డు భయ్యు (38), తోటి మేస్త్రీ ప్రదీప్‌తో కలిసి ఉపాధి కోసం వరంగల్‌కు వచ్చాడు. ఎస్సార్ విశ్వవిద్యాలయ భవన నిర్మాణంలో ఇనుపరాడ్లను వంచే పనులు చేస్తున్నాడు. ఈ నెల 9న ఉదయం 7.30 గంటల సమయంలో భవనంలోని నాలుగో అంతస్తు నుంచి కిందకు, కింది నుంచి పైకి ఇనుపరాడ్లను తరలిస్తుండగా ఓ రాడ్ ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుంచి కిందపడి పప్పు కుమార్ తలకు బలంగా గుచ్చుకుంది. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే అంబులెన్సులో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 10న రాత్రి 10.18 గంటలకు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఘటనపై మృతుడి సోదరుడు గుడ్డు భయ్యు శనివారం హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహణ కమిటీ ఎన్నికల ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు సెప్టెంబర్ 14లోపు సమర్పించాలి

**జనగామ** : జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు జనగామ ఆదేశానుసారం, జిల్లా ఉపాధి కల్పనాధికారి, జనగామ ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహణ కమిటీ సభ్యుల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారిగా నియమించడమైనదని, సమయ ప్రణాళికలో భాగంగా సెప్టెంబర్ 9వ తేదీన అర్హత కలిగిన ఓటర్ల జాబితాను ప్రచురించడమైనదని, జాబితాపై ఏవైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్న అర్హత కలిగిన సభ్యులు తమ అభ్యంతరాలు, ఆక్షేపణలను ఈ నెల సెప్టెంబర్ 14వ తేదీలోపు ఎన్నికల అధికారి, జిల్లా ఉపాధి కల్పనాధికారికి, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, అంబేద్కర్ నగర్, జనగామ నందు లిఖితపూర్వకంగా సమర్పించవలసిందిగా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ నెల 15వ తేదీన అందిన అభ్యంతరాలు, ఆక్షేపణలను పరిశీలించి, ఓటర్ల జాబితాలో అవసరమైన మార్పులు, చేర్పులపై అభిప్రాయాలను స్వీకరిస్తారని, అనంతరం తుది నిర్ణయం కోసం సెప్టెంబర్ 16న రాష్ట్ర శాఖకు జాబితాను పంపించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. సెప్టెంబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించడంతో పాటు అదే రోజు ఎన్నికల నోటిఫికేషన్, ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం ఎన్నికల అధికారి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జనగామ వెల్లడించారు.

# జనగామ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా 'ఫ్రెషర్స్ డే'

**ముఖ్య అతిథిగా హాజరైన సీడీసీ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు**

**జనగామ** : జనగామ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ప్రాంగణంలో "ఫ్రెషర్స్ డే" వేడుకలను శుక్రవారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. నూతనంగా చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఘనంగా స్వాగతం పలికారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీసీ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు హాజరై ప్రసంగించారు. విద్యార్థినులు చిన్నతనం నుంచే లక్ష్యాలను నిర్దేశించుకొని, ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. సమాజంలో లభించే ప్రతి మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.

# జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027--28 విద్యా సంవత్సరానికి 9వ, 11వ తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

**జనగామ** : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027--28 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 9వ, 11వ తరగతుల సీట్ల భర్తీ కోసం లేటరల్ ఎంట్రీ సెలెక్షన్ టెస్ట్--2027 నిర్వహించనున్నట్లు జవహర్ నవోదయ విద్యాలయ సమితి తెలిపింది. అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించింది. జవహర్ నవోదయ విద్యాలయాల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు 9వ, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలని నవోదయ విద్యాలయ సమితి నిర్ణయించింది. ఈ ప్రవేశాలు ఎన్.వి.ఎస్ విధానం ప్రకారం బాహ్య సంస్థ నిర్వహించే ఎంపిక పరీక్ష ఆధారంగా జరుగుతాయి. జవహర్ నవోదయ విద్యాలయాలు పూర్తిగా ఉచిత విద్యను అందించే సహ విద్యా, నివాస పాఠశాలలు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్ఈ అనుబంధంతో, ఎన్సీఈఆర్టీ పాఠ్య ప్రణాళిక ఆధారంగా ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన జరుగుతుందని, 9వ తరగతిలో హిందీ మాట్లాడే ప్రాంతాల నుంచి హిందీ మాట్లాడని ప్రాంతాలకు, అలాగే దీనికి విరుద్ధంగా విద్యార్థుల మైగ్రేషన్ విధానం అమలులో ఉంటుందని, విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసమే ఈ పాఠశాలల ప్రధాన లక్ష్యం అని తెలిపారు. 9వ తరగతి ప్రవేశానికి విద్యార్థి 01 మే 2012 నుంచి 31 జూలై 2014 మధ్య జన్మించి ఉండాలని, 2026--27 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతూ ఉండాలని, ప్రవేశం కోరుతున్న జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న అదే జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదివి, విద్యా సంవత్సరం పూర్తి చేయాలని తెలిపారు. 11వ తరగతి ప్రవేశానికి విద్యార్థి జన్మ తేది 01 జూన్ 2010 నుంచి 31 జూలై 2012 మధ్య ఉండాలని, 2026--27 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతూ ఉండాలని, జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న అదే జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి చదివి, విద్యా సంవత్సరం పూర్తి చేయాలని తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ: 30 సెప్టెంబర్ 2026, జె ఎన్ వి లేటరల్ ఎంట్రీ సెలెక్షన్ టెస్ట్ 10 ఏప్రిల్ 2027 న నిర్వహించనున్నట్లు తెలిపారు. రిజర్వేషన్ 75 శాతం సీట్లు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులకు, విద్యార్థి తన చదువులో ఏదైనా భాగాన్ని పట్టణ ప్రాంతంలో చదివినట్లయితే, అతడిని/ఆమెను అర్బన్ క్యాండిడేట్ గా పరిగణిస్తారని, గ్రామీణ ప్రాంతం అంటే పాఠశాల గ్రామ పంచాయతీ పరిధిలో ఉండటం, పట్టణ ప్రాంతం అంటే పాఠశాల మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో ఉండటం అని, ఎస్సీ, ఎస్టీ, పిహెచ్ బాలికలకు భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయని, జనగామ జిల్లాకు చెందిన అర్హత కలిగిన విద్యార్థులు నవోదయ విద్యాలయ సమితి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, 9వ, 11వ తరగతుల కోసం ప్రత్యేక ఆన్‌లైన్ దరఖాస్తు లింకులు అందుబాటులో ఉన్నాయని టి. రమేష్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీఎం శ్రీ పాఠశాల జవహర్ నవోదయ విద్యాలయం, మామూనూర్, వరంగల్ తెలిపారు.

# ఫ్రోబెల్ మోడల్ స్కూల్లో మట్టి విగ్రహాల తయారీ

**పర్యావరణన్ని కాపాడుకుందాం**
**సంప్రదాయల్ని భవితరాలకు అందిద్దాం**
**ప్రిన్సిపాల్ ల్యాదేళ్ల కృష్ణ గౌడ్**

**గణపురం** గణపురం మండల కేంద్రంలోని ఫ్రోబెల్ మోడల్ హైస్కూల్ పాఠశాల ప్రాంగణంలో శనివారం పర్యావరణహిత వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మట్టి, ఇతర సహజసిద్ధమైన పదార్థాలను ఉపయోగించి వివిధ ఆకృతుల్లో వినాయక విగ్రహాలను ఉత్సాహంగా తయారు చేశారు. సంప్రదాయాలను గౌరవిస్తూనే పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంపొందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా నిలిచింది.సంప్రదాయాన్ని జరుపుకుందాం. ప్రకృతిని కాపాడుకుందాం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, హానికర రసాయనాలకు దూరంగా ఉండండి అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎల్. కృష్ణ, కరస్పాండెంట్ పి. శివశంకర్, డైరెక్టర్లు ఎల్. యాదగిరి, ఎస్. జగన్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), హానికర రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను నివారించి మట్టి, ఇతర సహజ పదార్థాలతో తయారు చేసిన పర్యావరణహిత విగ్రహాలను వినియోగించాలని సూచించారు. పర్యావరణంతో పాటు నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ పర్యావరణహిత వేడుకల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు విగ్రహాల తయారీలో చురుకుగా పాల్గొనడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంరక్షణ, కాలుష్య నివారణపై ప్రసంగాలు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, బృందస్ఫూర్తి, పర్యావరణ బాధ్యతతో పాటు సాంస్కృతిక సంప్రదాయాల పట్ల గౌరవభావం పెంపొందింది విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం చురుకైన భాగస్వామ్యంతో పర్యావరణహిత వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య జరిగింది.





# వినాయక మండపాల అనుమతులు పక్కా..

**ఎస్సై గంగారపు కరుణాకర్.**
**భక్తి భావంతో పాటు భద్రత నిబంధనలు పాటించాలి.**
**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక.**
**మండపాల నిర్వాహకులు పోలిసుల సూచనలు తప్పక పాటించాలి.**

**నెల్లికుదురు** :నెల్లికుదురు మండలం వినాయక ఉత్సవ కమిటీ కార్యనిర్వాహకులు పోలీస్ స్టేషన్ నందు పక్కగా అనుమతులు తీసుకోవా లని,పోలీసుల సూచనలు పాటించాలని ఎస్సై గంగార పు కరుణాకర్ వెల్లడించారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా వినాయ క చవితి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో,ఎటువంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని ఇటీవల మండల పరిధిలోని సర్పంచ్ లకు, గణేష్ మండప నిర్వాహకుల సమావేశం నిర్వహించడం జరిగింద న్నారు. ప్రజలందరూ ఈ క్రింది నియమాలను తప్పనిసరిగా పాటించా లన్నారు.

**మండపాల అనుమతులు:–**
ప్రతి గ్రామంలో,ప్రతి కాలనీలో వినాయక మండపం ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా ముందుగా నెల్లికుదురు పోలీస్ స్టేషన్ కు వచ్చి అనుమతి పత్రం తీసుకో వాలని. అనుమతి లేని మండపాలను ఎట్టి పరిస్థితులలో అనుమ తించబోమన్నారు.

**విద్యుత్ మరియు భద్రత:–**
మండపాల దగ్గర విద్యుత్ వైర్లు వేలాడకుండా జాగ్రత్త వహించాలని. చిన్న పిల్లలు వైర్లను ముట్టుకోకుండా చూడాలని. ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా ఒక అగ్నిమాపక బకెట్ (ఇసుక/నీరు) ఉంచాలన్నారు.

**శబ్ద కాలుష్యం (డీజే / లౌడ్ స్పీకర్లు):–**
సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత డీజే లు, లౌడ్ స్పీకర్లు కట్టివేయాలని . అధిక శబ్దంతో ప్రజలకు, వృద్ధులకు, చిన్న పిల్లలకు ఇబ్బంది కలిగించరాదని నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

**శాంతి భద్రతలు:–**
ఉత్సవాల పేరుతో ఎవరైనా మద్యం సేవించి గొడవలు పడితే, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుం టాం. మండపాల వద్ద మహిళలు, చిన్న పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, దొంగతనాలు చేసినా ఉపేక్షించేది లేదని. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే బాగుంటుం దన్నారు.

**పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలు:–**
దయచేసి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓ పి ) విగ్రహాలను వాడవద్దని,మన చెరువు లను కాపాడేందుకు మట్టి గణపతులనే ప్రతిష్టిం చాలని,రంగులలో కెమికల్స్ లేనివి వాడలన్నారు.

**నిమజ్జనం రోజు నియమాలు:–**
నిమజ్జన ఊరేగింపులో పైకి ఎక్కి డ్యాన్స్ చేయడం, ట్రాక్టర్లు, డీసీఎం లపై ప్రమాదకరంగా కూర్చోవడం చేయవద్దన్నారు.నిమజ్జనా నికి పోలీస్ వారు కేటాయిం చిన రూట్ లోనే వెళ్లాలని. చెరువుల వద్ద లోతుగా ఉన్న ప్రదేశాల్లోకి వెళ్లవద్దు. ఈత రాని వారు నీళ్లలోకి దిగవద్దన్నారు.
పర్మిషన్ గురించి అప్లై చేయవలసిన లింక్,
గణేష్ అప్లికేషన్ పోర్టల్.
అప్లై చేసుకోవాలన్నారు.

**మీ సహకారం, మా భద్రత :–**



మీ గ్రామంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, ఏదైనా గొడవ జరిగినా వెంటనే డయల్ 100 కు లేదా నెల్లికుదురు ూ× కరుణాకర్ కి, స్టేషన్ కు సమాచారం అందిచా లాన్నారు.నెల్లికుదురు మండలంలో వినాయక చవితి ఉత్సవాలు ఎటు వంటి సంఘటనలు లేకుం డా ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా మండల ప్రజలకు,అధికారు లకు,అనధికారులకు ప్రజాప్ర తినిధులకు ముంద స్తు వినాయచవితి శుభాకాం క్షలు తెలియ జేస్తు న్నామన్నారు.

# బిఆర్ఎస్ మాజీ మార్కెట్ డైరెక్టర్ కూన భద్రాద్రి - ప్రముఖ జర్నలిస్టు కూన శ్రీను ల కుటుంబానికి పరామర్శ

**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చిలువేరు సమ్మి గౌడ్**



**కేసముద్రం** : కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కూన భద్రాద్రి తల్లి , ప్రముఖ పాత్రికేయులు కూన శ్రీనివాస్ (నానమ్మ) కూన మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా విషయం తెలిసిన వెంటనే వారి స్వగృహానికి వెళ్లి మల్లమ్మ కుటుంబాన్ని పరామర్శించారు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి,మల్లమ్మ గారి పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ పరామర్శలో సమ్మిగౌడ్ వెంట సామల నరసయ్య, కూన సారయ్య,మంద విక్రమ్,నీలం సుమన్, రవి తదితరులు ఉన్నారు.






# ‘సలార్’ ఫైట్ పాక్‌లో కాపీ.. అసలు నిజమేంటి?

పాన్ ఇండియా స్టార్ అయిన తర్వాత ప్రభాస్ చేసిన ఫుల్ లెంగ్త్ యాక్షన్ సినిమా ‘సలార్’. కేజీఎఫ్ తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించేసరికి ఈ మూవీపై విపరీతమైన అంచనాలు ఏర్పడ్డాయి. కానీ విడుదల విషయంలో పలుమార్లు వాయిదా పడటంతో ఎందుకనో థియేటర్లలో సరిగా ఫెర్ఫార్మ్ చేయలేదు. కానీ తర్వాత కాలంలో ఓటీటీ, టీవీలో ప్రసారమైన తర్వాత విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇప్పటికీ ఏదో ఒక సందర్భంలో ‘సలార్’ గురించి వినిపిస్తూనే ఉంటుంది. కానీ రీసెంట్‌గా కొన్నిరోజుల నుంచి ‘సలార్’ ఫైట్ సీన్‌ని పాకిస్తాన్‌కి చెందిన ఓ సినిమాలో కాపీ కొట్టారని చెప్పి సోషల్ మీడియాలో ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. కానీ ఇది ఏ మాత్రం నిజం కాదు. పాక్‌కి చెందిన హసీబ్ బిలాల్ అనే ఇన్ఫ్లుయెన్సర్.. ఏఐ ఉపయోగించి ‘సలార్’ స్ఫూర్తిగా తన ప్రతిరూపంలో వీడియో సృష్టించి దానిని తన ఇన్ స్టాలో పోస్ట్ చేశాడు. చూడటానికి ఇది రియల్‌గా ఉండేసరికి చాలామంది ఇది నిజమని అనుకుంటున్నారు. ఇకపోతే ప్రస్తుతం ఫౌజీ, స్పిరిట్, కల్కి 2 సినిమాలతో ప్రభాస్ బిజీగా ఉండగా.. మరోవైపు ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్‌తో ‘డ్రాగన్’ చేస్తున్నాడు. మరి వీళ్లు ఈ ప్రాజెక్టులు పూర్తి చేసిన తర్వాత ‘సలార్ 2’ కోసం కలుస్తారేమో చూడాలి? దీని కోసం ప్రభాస్ ఫ్యాన్స్ కాస్త గట్టిగానే ఎదురుచూస్తున్నారు.

# రచ్చ లేపడానికి రెడీ.. ఒక్క పోస్టుతో ‘స్వయంభూ’పై అంచనాలు పెంచేసిన నిఖిల్



యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడిక్ చిత్రం ‘స్వయంభూ’పై అంచనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై నిఖిల్ తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ పంచుకున్నారు. ఒకే సినిమా కోసం 175 రోజులు షూటింగ్ చేయడం, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉండటం తన కెరీర్‌లో ఇదే తొలిసారని ఆయన తెలిపారు. మంచి ప్రయత్నాలకు సమయం పడుతుందని, త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు నిఖిల్ తన ‘ఎక్స్’ ఖాతాలో పోస్ట్ చేశారు. ““స్వయంభూ’ ఒక పాన్ ఇండియా చిత్రంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మంచి పనులకు సమయం పడుతుంది. మేము దాదాపు ఆ దశకు చేరుకున్నాం. ఒకే సినిమా కోసం 175 రోజులు షూట్ చేస్తానని, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉంటాయని నేను ఎప్పుడూ ఊహించలేదు. కానీ... రచ్చ లేపడానికి రెడీ. త్వరలోనే విడుదల తేదీ ప్రకటన ఉంటుంది” అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది. ఇటీవల హీరోయిన్ సంయుక్త పుట్టినరోజు సందర్భంగా, ఆమె పోషిస్తున్న ‘భూమి’ పాత్రకు సంబంధించిన ఒక బీటీఎస్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె పడిన కష్టం స్పష్టంగా కనిపించింది. ఈ సినిమా కోసం సంయుక్త ఎంతో ధైర్యంగా ఒక ప్రమాదకరమైన స్టంట్ చేశారని దర్శకుడు భరత్ కృష్ణమాచారి గతంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లిలో చిత్రీకరించిన ఒక సన్నివేశంలో, కింద నది ప్రవహిస్తుండగా కేవలం ఒకే ఒక్క హార్నెస్ సాయంతో ఆమె రెండు రోజుల పాటు తాడుపై వేలాడుతూ పర్వతాన్ని అధిరోహించారని వివరించారు. ఈ సినిమా కోసం హీరో నిఖిల్ కూడా వియత్నాం వెళ్లి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. రెండు చేతులతో కత్తి యుద్ధం చేయడంలో ఆయన ప్రావీణ్యం సంపాదించారు. కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా సినిమాలో నటించిన వందలాది మంది సహాయ నటీనటులకు కూడా వియత్నాం నుంచి వచ్చిన నిపుణులతో కత్తి యుద్ధంలో శిక్షణ ఇప్పించారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో దాదాపు 60 రోజుల పాటు భారీ క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. భారతీయ సాంస్కృతిక వారసత్వపు మూలాలతో, ఒక యోధుడి గాథ ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ‘స్వయంభూ’ విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# నా సినిమాలను నేను చూడలేను

ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె ‘వైబ్’ అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు ‘బట్వారా 1947’ చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. ‘వైబ్’లో ఆమె ‘మేడమ్ హెచ్’ అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు ‘ఇంపాస్టర్ సిండ్రోమ్’ అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు ‘చేయగలనా, లేదా?’ అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. “నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది” అని ప్రీతి వెల్లడించింది.



# మహిళలు మాత్రమే తాళి వేసుకోవాలా.. పెళ్లి గుర్తుగా పురుషులు కూడా ఏదైనా ధరించాలి: నటి నమిత



ఒకప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి నమిత... పెళ్లి చేసుకున్న తర్వాత సినిమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా వివాహ వ్యవస్థ, మహిళలపై అమలవుతున్న సంప్రదాయ నిబంధనలపై చేసిన వ్యాఖ్యలతో మరోసారి చర్చల్లో నిలిచారు. వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల జీవితాలను, భావోద్వేగాలను కలిపే సమానమైన బంధమని... అలాంటప్పుడు పెళ్లికి సంబంధించిన నియమాలు, బాధ్యతలు కేవలం మహిళలకే ఎందుకు పరిమితం కావాలని ఆమె ప్రశ్నించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. వివాహ ఆచారాల గురించి మాట్లాడుతూ... పెళ్లి తర్వాత మహిళలు ఎలా ఉండాలి, ఏం ధరించాలి, ఏయే సంప్రదాయాలను పాటించాలి అనే విషయంలో సమాజంలో ఎన్నో నియమాలు ఉంటాయని నమిత అన్నారు. కానీ పురుషుల విషయంలో ఇలాంటి నిబంధనలు, ఆంక్షలు చాలా తక్కువగా ఉండటం సరైనది కాదని... మారుతున్న కాలానికి అనుగుణంగా అందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వివాహానికి గుర్తుగా మహిళలు మాత్రమే తాళిబొట్టు ఎందుకు ధరించాలని, పెళ్లయిందనే గుర్తింపుగా పురుషులు కూడా ఏదో ఒక గుర్తును ఎందుకు ధరించకూడదని ఆమె అన్నారు. నమిత చేసిన ఈ వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఆధునిక కాలంలో భార్యాభర్తలిద్దరికీ సమాన హక్కులు, ప్రాధాన్యత ఉండాలని కోరుకునే కొందరు నెటిజన్లు ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తుండగా... మరికొందరు మాత్రం తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాల ప్రాధాన్యతను అర్థం చేసుకోకుండా ఇలా ప్రశ్నించడం సరికాదని విమర్శలు గుప్పిస్తున్నారు.



# వెంకీ-త్రివిక్రమ్ ‘ఆదర్శ కుటుంబం’ టీజర్ ఇదిగో.. నవ్వులతో మొదలై థ్రిల్లింగ్ మలుపు!

తెలుగు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కాంబినేషన్లలో విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌లది ఒకటి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ‘ఆదర్శ కుటుంబం’ (హౌస్ నెం: 47 / శాఖ 47) సినిమా నుంచి అభిమానులకు అదిరిపోయే ట్రీట్ వచ్చింది. తాజాగా విడుదలైన ఈ చిత్రం టీజర్, అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్ ఆరంభం నుంచి త్రివిక్రమ్ మార్క్ స్పష్టంగా కనిపించింది. సరికొత్త లుక్‌లో కనిపించిన వెంకటేశ్, తనదైన కామెడీ టైమింగ్, డైలాగ్ డెలివరీతో కట్టిపడేశారు. “డబ్బు సబ్బు లాంటిది రా, చేతులు కడుక్కోవడానికే పనికొస్తుంది”, కుటుంబం అప్పుల లెక్కలు చెప్పే సన్నివేశాలు, వంటింట్లో జరిగే సంభాషణలు ప్రేక్షకుల పెదాలపై నవ్వులు పూయించాయి. మధ్యతరగతి కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను వినోదాత్మకంగా చూపిస్తూనే, కథలో కీలక మలుపును పరిచయం చేశారు. కుటుంబమంతా కలిసి ‘శాఖ 47’ అనే పేరున్న ఓ డ్యూప్లెక్స్ ఇంట్లోకి మారడంతో కథ మరో స్థాయికి వెళుతుంది. అంతా సంతోషంగా సాగుతున్న సమయంలో ఓ క్రైమ్ సంఘటన జరగడం, విలన్ ఎంట్రీతో టీజర్ ఒక్కసారిగా సీరియస్ టర్న్ తీసుకుంటుంది. దీంతో ఈ సినిమా కేవలం కుటుంబ కథ మాత్రమే కాదని, ఇందులో థ్రిల్లింగ్ అంశాలు కూడా ఉన్నాయని స్పష్టమవుతోంది. కామెడీ, ఎమోషన్స్, సస్పెన్స్‌తో కూడిన ఒక సంపూర్ణ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను త్రివిక్రమ్ సిద్ధం చేసినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రంలో వెంకటేశ్ సరసన ‘కేజీఎఫ్’ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. నారా రోహిత్, దివ్యేందు శర్మ, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిశోర్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో భాగమయ్యారు. తమన్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది. నిర్మాతలు ఈ చిత్రాన్ని గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విడుదలైన కొద్ది గంటల్లోనే విశేష స్పందన రాబట్టుకున్న ఈ టీజర్, సినిమాపై ఉన్న అంచనాలను తారాస్థాయికి చేర్చింది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967